
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
బుధవారం 29 అక్టోబరు 2025



పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాల

దరఖాస్తుకు గడువు పెంపు

సిద్దిపేటకల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కళాశాలలు, మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబరు 31 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

సదర్ ఉత్సవంలో స్టెప్పులేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డిలో ఘనంగా పెద్దగొల్ల సదర్ ఉత్సవం

- ఆకట్టుకున్న దున్నరాజుల విన్యాసాలు
- పాటలతో జోష్ తెప్పించిన గాయకులు



పెద్దగొల్ల సదర్ ఉత్సవంలో దున్నరాజులతో జగ్గారెడ్డి



మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో పెద్దగొల్ల సదర్ ఉత్సవం ఘనంగా జరిగింది. దున్నరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. యువత అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. వారిలో జోష్ నింపేలా సింగర్స్ పాటలు పాడారు. ఈ సదర్ ఉత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటోలు దిగి.. స్టెప్పులేసి

సదర్ ఉత్సవానికి హాజరైన జగ్గారెడ్డి అందరిలో జోష్ నింపారు. కార్యక్రమానికి వచ్చిన వారు ఆయనతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి ప్రదర్శించారు. అనంతరం అక్కడున్న వారితో కలిసి జగ్గారెడ్డి స్టెప్పులు వేశారు. సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ప్రతినిధులను ఆయన అభినందించారు.



ఆలయంలో కలశపూజ

వైభవంగా ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



అభిషేక కళాశాలతో భక్తులు

కొండపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మర్పడగ విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పేల హరినాథశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అమ్మవారికి అష్టోత్తర శత కలశాభిషేకం, స్వర్ణ కిరీటానికి ప్రత్యేక పూజలు, అధివాసాలు నవావరణ యాగం మూల మంత్రహవవనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పౌష్టికాహారం తప్పనిసరి

- కలెక్టర్ హైమావతి
- కొండపాక పీహెచ్‌సీ తనిఖీ

సిద్దిపేటకల్చరల్/కొండపాక/సిద్దిపేటఅర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచభూతాలు మన శరీరంలో ఉన్నాయి.. అవి సరిగా పనిచేయాలంటేసమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వారి వారి వయసును బట్టి ఆహారం తీసుకోవడం ముఖ్యమని ఆమె సూచించారు. మంగళవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె బాలామృతంతో వండిన వంటకాల స్టాళ్లను పరిశీలించి, వాటి రుచిని చూశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ తల్లులు తప్పకుండా తమ పిల్లలకు ఇంట్లో వండిన ఆహారం మాత్రమే వండించాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల కలిగి అనర్థాలపై ప్రదర్శన ఇచ్చిన బాలసదనం బాలలకు, ఊబకాయం పై నిర్వహించి డ్రాయింగ్ పోటీలో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఉత్తమ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బందికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీపీవో దేవకిదేవి, డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు. కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అటెండెన్స్, ఓపీ (ఔట్‌పేషెంట్) రిజిస్టర్‌లను పరిశీలించి, మెడికల్ ఆఫీసర్ శ్రీధర్‌తో పాటు సిబ్బందిని అభినందించారు. పీహెచ్‌సీలో రిపేర్లకు సంబంధించిన వివరాలు పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులతో ఎక్కువ అంచనా (ఎస్టిమేట్) వేయించాలని డీఎంహెచ్‌వోను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం ప్రాంగణంలోని ఆయుష్ సేవలపై ఆమె ఆరా తీశారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని బాలికల గురుకుల పాఠశాల, తెలంగాణ సామాజిక బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేస్తుంటే టీచర్లెవరూ మానిటర్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలను ఇష్టానుసారంగా వదిలేస్తే ఎలా అని ప్రిన్సిపల్‌పై మండిపడ్డారు. విద్యార్థులందరూ తిన్నాకే టీచర్లు తినాలని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను హెచ్చరించారు.

ఆట కట్టించారు

సిద్దిపేట పట్టణ నడిబొడ్డున ఎవరి కళ్లకూ చిక్కకుండా, తమకు అన్ని అనుమతులూ ఉన్నాయని చెప్పి విచ్చలవిడిగా సాగుతున్న సిటిజన్స్ క్లబ్ పేకాట దందాకు ఎట్టకేలకు పోలీసులు ఆట కట్టించారు. కొన్ని నెలలుగా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్న ఈ పత్తాలాట క్లబ్ నిర్వాహకుల అండదండలతో మరింత దారుణంగా మారింది.

- సిద్దిపేట అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)

- సిద్దిపేట సిటిజన్స్ క్లబ్‌పై పోలీసుల మెరుపుదాడి
- పేకాట ఆడుతున్న 50 మంది అరెస్ట్
- పట్టుబడిన వారిలో కీలక రాజకీయ నేతలు
- 'క్లబ్బులో గబ్బు' అంటూ ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'
- కొత్త సీపీ ఆదేశాలతో ఎట్టకేలకు బట్టబయలు



సిటిజన్స్ క్లబ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

క్లబ్‌లో సభ్యత్వం ఉన్నవారు కాలక్షేపం కోసం ఆటలు ఆడాల్సింది పోయి, నిషేధిత పత్తాలాటను యథేచ్ఛగా కొనసాగించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన పేకాటరాయుళ్లను కూడా క్లబ్‌లోకి ఆహ్వానించి ప్రోత్సహించారు. ఈ మేరకు డబ్బు పెట్టి పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు చేసి 50 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. క్లబ్ చరిత్రలో ఇంత పెద్ద సంఖ్యలో పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇది రెండోసారి.

బాధితుల ఫిర్యాదులను పట్టించుకోని వైనం

గతంలో పేకాట వ్యసనం కారణంగా కుటుంబం వీధిన పడి, భార్య మెడలోని బంగారం తాకట్టుపెట్టి రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్న బాధితులు కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులను ఆశ్రయించినా పట్టింపులేని సందర్భాలున్నాయి. గతంలో కొద్దిరోజులు మానేసినా, గతేడాది నుంచి తిరిగి పత్తాలాటకు దారులు తెరుచుకోవడంతో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. క్లబ్ ఆదాయం కోసం పేకాటలో గెలిచిన వారి నుంచి 4 శాతం నుంచి 10 శాతం వరకు కమీషన్ వసూలు చేశారని తెలుస్తోంది.



క్లబ్బులో పేక ముక్కలను, కాయిన్స్, ఫోన్‌లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

గోవా క్యాసినో తరహాలో నిర్వహణ

పేకాటను నిరాటంకంగా కొనసాగించేందుకు క్లబ్ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని క్లబ్ కార్యాలయంలో కాయిన్‌లను తయారు చేయించి విక్రయించేవారు. వెయ్యి రూపాయలకు రూ. 10 కాయిన్, రెండు వేలకు రూ. 20 కాయిన్, రూ. 50 వేలకు రూ. 50కాయిన్‌లను ప్రత్యేకంగా ఇచ్చేవారు. రమ్మీలో గెలిచినవారు ఈ కాయిన్‌లను కార్యాలయంలో చూపిస్తే, నగదు రూపంలో లేదా ఆన్‌లైన్‌లో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసేవారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్త సీపీ ఆదేశాలతో మెరుపుదాడి

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిటిజన్ క్లబ్‌లో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏసీపీ రవీందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్ ఆధ్వర్యంలో

మిగతా 8వ పేజీలో

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు

- మొదటిసారి పట్టుబడితే రూ.10వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు
- రెండో సారి పట్టుబడితే రూ.15వేల జరిమానా : గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింలు



ఏసీపీ నర్సింలు

గజ్వేల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయని గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింలు తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఏసీపీ కార్యాలయంలోని మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మొదటి సారి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి రూ.10వేల జరిమానా లేదా ఆరు నెలల జైలుశిక్ష అమల్లోకి వచ్చిందని, ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తామని తెలిపారు. రెండో సారి పట్టుబడితే రూ.15వేల జరిమానా, జరిమానా కట్టని వారికి జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని చెప్పారు. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు వ్యక్తిగత భద్రత నియమాలు పాటించాలని, నిబంధనలు పాటించని పక్షంలో చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మర్..డర్..!

- ఏడాదినర్నరలో రెండు
- గతంలో చికెన్ షాప్ యాజమాని
- తాజాగా సెక్యూరిటీ గార్డ్
- ఇతర రాష్ట్రాల వారే నిందితులు

6

యాప్ సోపాలు

- పత్తి అమ్మకాలకు 'కపాస్ కిసాన్' అడ్డంకి!
- యాప్ వినియోగంపై రైతుల్లో అవగాహన లోపం
- స్మార్ట్‌ఫోన్ లేని రైతులపై తీవ్ర ప్రభావం
- నిబంధనలు సడలించాలని వేడుకోలు

పత్తి రైతులను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. సీజన్ ప్రారంభంలో వానలు కురవక ఆందోళన చెందారు. ఆ తర్వాత అధిక వర్షాలతో చేతికొచ్చింది అనుకున్న తెల్లబంగారం కాస్త నల్లబంగారంగా మారింది. ఫలితంగా ఎదుగుదల లేక దిగుబడి కోల్పోయారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి కాస్తో, కూస్తో పంట చేతికందినప్పటికీ విక్రయించేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తుంది. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలుకు చర్యలు చేపట్టినప్పటికీ అవకతవకల నివారణ పేరిట ఈ ఏడాది కపాస్ కిసాన్ యాప్ అందుబాటులోకి తీసుకురావడం, సంబంధిత యాప్ వినియోగంపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతో అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. దీంతో పత్తి అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

- చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)



నల్లబారుతున్న పత్తి చేలు

కపాస్ కిసాన్ యాప్ వాడాలంటే స్మార్ట్‌ఫోన్ తప్పనిసరిగా ఉండాలి. కానీ పలువురు రైతులు తమ ఆర్థిక పరిస్థితుల వల్ల అవగాహన లోపంతో ఇప్పటికీ కీప్యాడ్ ఫోన్లనే ఉపయోగిస్తున్నారు. దీంతో పత్తి విక్రయంలో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు పత్తిసాగు విస్తీర్ణానికి సంబంధించి గతంలో వ్యవసాయశాఖ సిబ్బంది సర్వే చేపట్టి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేశారు. సంబంధిత వివరాలు నమోదు చేసిన రైతులు సాగుచేసిన పత్తిని మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు చెబుతున్నారు. కపాస్ యాప్‌లో వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేసుకుంటేనే సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయనుండగా, సంబంధిత వివరాలేవీ తెలియని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

గతంలో రైతులకు నచ్చిన జిన్నింగ్ మిల్లుకు తీసుకెళ్లి పత్తిని విక్రయించేవారు. కానీ ప్రస్తుతం యాప్‌లో నమోదు చేసిన మిల్లుకు తప్ప ఇతర మిల్లుకు తీసుకువెళ్లే పరిస్థితి లేదు. గతంలో అక్కడ రద్దీగా ఉన్నా, అవకతవకలకు పాల్పడినా తమ పత్తిని వెనక్కి తీసుకుని వెళ్లేవారు. కానీ ప్రస్తుతం అందుకు ఆస్కారం లేకుండా పోయింది. ఇప్పటికే దిగుబడి భారీగా తగ్గిందని ఆందోళన చెందుతుండగా, కపాస్ యాప్ వివరాల నమోదు గుదిబండగా మారిందని కలవరపడుతున్నారు.

అకాల వర్షాలతో అయోమయం

అతివృష్టి, అనావృష్టి ఫలితంగా పత్తి ఎదుగుదల ఆలస్యం కావడంతో ఇప్పటికీ సగానికిపైగా రైతులు చేలలో నుండి పత్తి సేకరించలేదు. ఇటీవలి కాలంలో పత్తి ఏరడానికి ప్రయత్నిస్తుండగా, మళ్లీ అకాల వర్షాలు కురుస్తుండటంతో ఆటంకం కలుగుతుంది. కూలీల కొరతకు తోడు వర్షాల కారణంగా పత్తి మొక్కలు నల్లబారుతున్నాయి. చేతికందే దశలో పత్తి దెబ్బతింటుంది. పలువురు రైతులు పొలం నుంచి నేరుగా మిల్లుకు పత్తిని తరలించేందుకు ఉపక్రమిస్తుండగా, స్లాట్ బుకింగ్ నమోదు రోజు విక్రయించని యెడల తేమశాతం ప్రామాణికతతో గిట్టుబాటు పొందడం అగమ్యగోచరంగా మారింది. ఆయా పరిణామాల నేపథ్యంలో కాస్తంత దిగుబడిని కూడా అమ్ముకోలేక, వర్షాలతో చేల నుంచి సేకరించి నిల్వ చేసుకోలేక నష్టం చవిచూడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి కపాస్ కిసాన్ యాప్ వినియోగంతో పాటు స్లాట్ బుకింగ్ మార్పులు, ఇతరత్రా లోటుపాట్లపై సందేహాలను నివృత్తి చేసేందుకు

మిగతా 8వ పేజీలో

రైతుల్లో 'మొంథా' గుబులు

- ముంచుకొస్తున్న తుఫాను
- తుఫాన్ వల్ల పంటలు నేలపాలయ్యే అవకాశం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

జగదేవ్‌పూర్/చేర్యాల అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతి ప్రభావంతో నష్టపోవడం ఒక వైపు, పెట్టుబడి తిరిగి వస్తుందో రాదోనన్న ఆందోళనలో రైతులు ఉండగా, ఇప్పుడు ముంచుకొస్తున్న మొంథా తుఫాను రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. ముందస్తుగా వరి కోతలు పూర్తిచేసిన రైతులు రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యంపై ఈ తుఫాను తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకవేళ మొంథా తుఫాను వస్తే పంట అంతా నేలపాలయ్యే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు, రాబోయే మూడు నాలుగు రోజులు భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. దీంతో చేతికి వచ్చే పంట చేజారిపోతుందని రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు మూడుసార్లు వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పత్తి తీసే పనులు, వరి కోత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3 లక్షల ఎకరాలకు పైగా వరి, 1.07 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గత ఇరవై రోజుల నుంచే సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. గజ్వేల్ నియోజకవర్గంలో వరి సాగు ఆలస్యం కావడంతో కోతలు ఇంకా మొదలు కాలేదు.



సిద్దిపేట పట్టణంలో కమ్ముకున్న కారుమబ్బులు

రైతులు ఎకరానికి పత్తి పంటకు రూ. 30వేల నుంచి రూ.50వేల వరకు, వరి సాగుకు రూ. 20వేల నుంచి రూ. 40వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు వాపోతున్నారు. మొంథా తుఫాను ప్రభావం ఇలాగే కొనసాగితే చేతికొచ్చిన పంట నీటిపాలు కావడంతోపాటు, రైతులు నిండా మునగడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో



మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు



తడిసిన ధాన్యం నుంచి నీటిని ఎత్తిపోస్తున్న వృద్ధురాలు

చేర్యాలలో వర్షం.. తడిసిన ధాన్యం

చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం వర్షానికి తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా, పట్టణంలోని అంగడి బజారులో ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంతలో కూడా వర్షం కారణంగా కూరగాయల క్రయవిక్రయాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

మర్.. డర్..!



గతేడాది హత్యకు గురైన చికెన్ దుకాణం యజమాని

- ఏడాదినర్నరలో రెండు
- గతంలో చికెన్ షాప్ యాజమాని
- తాజాగా సెక్యూరిటీ గార్డ్
- ఇతర రాష్ట్రాల వారే నిందితులు

గజ్వేల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ డివిజన్ పరిధిలో హత్యలు కలకలం రేపుతున్నాయి. బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీల్లో కొందరు హత్యలకు తెగబడటం ఆందోళన కలిగిస్తోంది. డబ్బుల కోసమే.. ఇతర కారణాలు ఏమున్నాయో కానీ హత్యలతో పాటు కొందరు గంజాయి, మాదకద్రవ్యాల సరఫరాలోనూ కీలకంగా మారుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాదిన్నరలో రెండు హత్యలు జరగగా, అక్కడక్కడ పట్టుపడుతున్న గంజాయి అక్రమ రవాణాలోనూ ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల వారే ఉంటున్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

గతేడాది జగదేవ్‌పూర్‌లో..

గతేడాది ఏప్రిల్ 21న జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని రాంరెడ్డి చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తున్న మహిపాల్‌రెడ్డిని దుకాణంలో పనిచేసే పశ్చిమ బంగాకు చెందిన ఇద్దరు చంపేసి, దుకాణంలో ఉన్న డబ్బులను ఎత్తుకు వెళ్లి పోలీసులకు దొరికిపోయారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని వీ-మార్ట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఆడెపు బాలయ్య తోటి సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన వ్యక్తులు హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆడెపు బాలయ్య చనిపోయిన అనంతరం ఆయనతో కలసి సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వ్యక్తులు అదృశ్యమవడం అనుమానాలకు తావిస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

ఇతర రాష్ట్రాల కూలీల డేటా ఎక్కడ...?

ఉపాధి కోసం పలు రాష్ట్రాల నుంచి జిల్లాకు పెద్ద సంఖ్యలో కూలీలు, ఇతర పనులు చేసేవారు వస్తున్నారు. అయితే, వారికి సంబంధించి ఎలాంటి డేటా ఎవరూ సేకరించడం లేదు. రోజూ వందల సంఖ్యలో వీరు వస్తున్నా.. కనీస సమాచారం కూడా ఎవరూ సేకరించడం లేదు. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను టేకేదార్లుగా అవతారమెత్తిన పలువురు తీసుకువచ్చి ఇక్కడ పనుల్లో పెడుతుండగా, మరికొంత మంది ఉపాధి వెతుక్కుంటూ ఇక్కడకు వస్తున్నారు. స్థానిక కూలీలకంటే తక్కువ రేటుకు వీరు పనులు చేయడంతో పాటు పనులు బాగా చేస్తారన్న నమ్మకంతో ఇక్కడ అవసరం ఉన్నవారు ఇతర రాష్ట్రాల కూలీలపైనే ఆధారపడుతున్నారు. ఎవరు ఎటువంటి వారో అర్థం కాకుండా పోతుంది. ఇలా వచ్చిన వారిలో కొంతమంది కొందరు నేరాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఇతర రాష్ట్రాలకు చెంది.. సజావుగా, నిజాయితీగా పనిచేసే వారికి ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో వలస కూలీల డేటాను సేకరించాలని, పనిలో పెట్టుకునే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసేవిధంగా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.



హత్యకు గురైన సెక్యూరిటీ గార్డు

వివరాలను సేకరించాలి



ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీల వివరాలను తప్పనిసరిగా సేకరించాలి. వారి ఆధార్ కార్డు, కుటుంబవివరాలు, నేపథ్యం తెలుసుకోవాలి. పనిలో పెట్టుకునే వారు తప్పనిసరిగా వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో/యూనియన్ కార్యాలయంలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇతర రాష్ట్రాల కూలీలు ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. అందులో కొందరు చోరీలు, గంజాయి విక్రయాలకు పాల్పడే అవకాశం ఉంది. హత్యలు చేస్తుండటంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అధికార యంత్రాంగం ఈ విషయంలో చొరవ చూపాలి.

\- బారు అరవింద్, బీజేపీ నాయకులు, గజ్వేల్

సెక్యూరిటీ గార్డ్ దారుణహత్య



బాలయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వీ మార్ట్ స్టోర్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఆడెపు బాలయ్య (40) మంగళవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణంలోని బీడీ కాలనీలో నివసిస్తున్న బాలయ్యకు భార్య పుష్ప, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బాలయ్య వీమార్ట్‌లో ఐదేళ్లుగా సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి 6 గంటలకు డ్యూటీకి వచ్చిన బాలయ్య మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి రాలేదు. హత్య విషయం తెలియగానే పోలీసులు వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. డాగ్ స్క్వాడ్‌తో క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తున్నారు. అయితే, బాలయ్య హత్యకు గురై పడి ఉన్నాడని తెలియగానే కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అయితే, బీహార్‌లోని భోజ్‌పూర్ జిల్లాకు చెందిన రితేష్‌రాయి (27), రంజిత్‌రాయి (27) సైతం వీమార్ట్ ప్రారంభం నుంచి సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారు. తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో బాలయ్య హత్యకు గురి కాగా, అప్పటి నుంచి వారు అదృశ్యమయ్యారు. అయితే, బీహార్‌కు చెందిన సెక్యూరిటీ గార్డులే బాలయ్య గొంతునులిమి హత్య చేసి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకుగల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



అశోక్ షెట్కార్ కాంప్లెక్స్ ఎదుట రోడ్డుపై గుంత

నారాయణఖేడ్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని ప్రధాన రోడ్డుపై పలుచోట్ల గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. మంగల్‌పేట నుంచి బసవేశ్వర చౌక్, శివాజీ చౌక్ వరకు గోతులు ఏర్పడ్డాయని, దీంతో రాత్రి సమయంలో వాహనాలు ప్రమాదాల బారినపడుతున్నామని తెలిపారు. అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆర్‌ఎంపీపై విచారణ



ఆర్‌ఎంపీ నుంచి మందులు స్వాధీనం చేసుకుంటున్న వైద్యాధికారి

మద్దూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో ఆర్‌ఎంపీగా కొనసాగుతున్న పూర్ణచందర్‌పై కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాలతో పోలీసుల సహాయంతో లద్నూరు వైద్యాధికారి అర్జున్‌రాజ్ మద్దూరు వైద్యాధికారి మహేందర్‌తో కలిసి తహసీల్దార్ రహీం, ఎంపీడీవో రామ్మోహన్, ఎంపీవో వెంకటేశ్వర్లు సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యమందిస్తున్న రూంతో పాటు ఇంట్లో సోదాలు చేసి పూర్ణచందర్ నుంచి సిరంజీలు, స్టెరాయిడ్స్ బుడ్డీలు, పెయిన్ కిల్లర్స్, యాంటీ బయాటిక్ ఒదులను స్వాధీనం చేసుకున్నట్లు వైద్యాధికారి అర్జున్‌రాజ్ తెలిపారు. విచారణ సమయంలో ఓ మహిళకు ఇంజక్షన్ చేస్తున్నాడని తెలిపారు. విచారించగా వైద్యులు రాసి ఇచ్చిన ప్రిస్కిప్షన్‌పై ఐరన్ ఇంజక్షన్స్ పెడుతున్నట్లు పూర్ణచందర్ ఒప్పుకున్నట్లు తెలిపారు. తనలాగా మండలంలో 33 మంది అనుమతులు లేకుండా ఆర్‌ఎంపీగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చెందిన యాదమ్మ కరోనా సమయంలో కొడుకు రాజుకు ట్రీట్‌మెంట్ చేసి మృతికి కారకుడయ్యాడని తెలిపిందన్నారు. డీఎంహెచ్‌వోకు పోలీసులు చేసిన ఫిర్యాదు మేరకు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టి నివేదికను డీఎంహెచ్‌వోకు అందించినట్లు తెలిపారు. అనంతరం పూర్ణచందర్‌ను స్టేషన్‌కు తరలించారు.

రంజోల్‌లో వివాహిత అదృశ్యం

జహీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన క్రిస్టీనా(21) హైదరాబాద్‌లో నర్సింగ్ కోర్సును చదువుతున్నది. నెలరోజుల క్రితం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చింది. ఈనెల 26న అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అలిగి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 872661847, 8712656764, 872656731 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారమందించాలన్నారు.

గౌరారంలో యువకుడు..

వర్గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : యువకుడు అదృశ్యమైన సంఘటన వర్గల్ మండలం గౌరారం గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రావనిఇకి చెందిన నరాని సాయికుమార్(24) సోమవారం మధ్యాహ్నం ఇంట్లోంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి తెలిపారు.

ఇంట్లోకి చొరబడి...తుపాకీతో బెదిరించి..

అగంతుకులను పట్టుకున్న గ్రామస్తులు

మిరుదొడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంకీ క్యాపులను ధరించి ఇంట్లోకి చొరబడిన ఇద్దరు అగంతుకులు తుపాకీతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. వారిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన కలకలం చోటుచేసుకుంది.. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ లక్ష్మీనర్సయ్య ఇంట్లోకి మంగళవారం రాత్రి ఇద్దరు అగంతకులు చొరబడి తుపాకీతో బెదిరించడంతో కుటుంబసభ్యులు అరుపులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇద్దరు అగంతకులు పారిపోతుండగా, గ్రామస్తులు వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, మిరుదొడ్డి ఎస్‌ఐ సమతాలు విచారణ చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

ఝరాసంగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని తహసీల్దార్ తిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సాపూర్ పట్టణానికి చెందిన రమేష్(38) మాంసం విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు. మూడో కుమారుడు రమేష్‌కు ఈ మధ్యనే పెళ్లి కుదిరింది. పెళ్లికి కావాల్సిన డబ్బుల కోసం తండ్రి ఎంత ప్రయత్నం చేసినా లభించలేదు. దీంతో మదనపడిన రమేష్ సోమవారం బయటకు వెళ్లి రాత్రయినా రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం ఉదయం సమీపంలోని రాయరావు చెరువులో అక్కడ పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందికి మృతదేహం కనిపించింది. వారు వచ్చి చూసి రమేష్‌గా గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

అల్లాదుర్గం, అక్టోంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన ఎన్.నాగచారి(35) మండలంలోని రాంపూర్ శివారులోని దుబ్బచెరువులో ఈ నెల 27న పడ్డాడు. గజ ఈతగాళ్లతో గాలించగా మంగళవారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు నాగచారి మూడునెలలుగా మతి స్థిమితం కోల్పోయాడు. పలు ప్రాంతాల్లో సంచరిస్తూ సోమవారం రాంపూర్ చెరువు వద్దకు వెళ్లి తన భార్య శైలజకు వీడియో కాల్‌చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్‌ఐ వివరించారు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

పాము కాటుతో ఎద్దు మృతి

కంగ్టి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో ఎద్దు మంగళవారం మృతిచెందింది. మండల పరిధిలోని నాగూర్.కే గ్రామానికి చెందిన తుకారాం రోజు మాదిరిగా తన ఎద్దును మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. ఎద్దు మేస్తున్న క్రమంలో పాము కాటు వేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. కాగా పశు వైద్యాధికారి ముస్తాక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

చిన్నశంకరంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట గ్రామంలో మట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. గ్రామంలోని ఇటుక బట్టీలకు అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేశారు. అక్రమ దందాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్‌ఐ హెచ్చరించారు.

'నువ్వొక్కడివే ఎందుకు.. నేను కూడా చస్తా'

- ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగిన తండ్రి
- అది చూసి కొడుకూ ఆత్మహత్యాయత్నం
- తండ్రి మృతి, కుమారుడి పరిస్థితి విషమం



సయ్యద్ ఆరిఫ్(ఫైల్)

నర్సాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణకు ఆరోగ్యం సహకరించక, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి తన కుటుంబసభ్యుల ఎదుటే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అది చూసిన అతని కుమారుడు.. నువ్వొక్కడివే చావడం ఎందుకు? నేను కూడా చస్తానంటూ.. క్షణికావేశంలో పురుగు మందు తాగేశాడు. ఈ ఘటనలో తండ్రి కోల్పోగా.. కుమారుడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సాపూర్‌లోని ఎన్‌జీవో కాలనీకి చెందిన సయ్యద్ ఆరిఫ్(48) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆరిఫ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైన ఆరిఫ్ మూడునెలలుగా పనికి దూరమై ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోగా తీవ్ర మనస్తాపానికి గురైన ఆరిఫ్ కొద్దిరోజులుగా తన భార్య వద్ద తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. అక్టోబరు 26న బయటకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన ఆరిఫ్.. కుటుంబసభ్యులకు ఓ సీసాను చూపించి పురుగు మందు తాగానని, చనిపోతున్నానని చెప్పాడు. తమను బెదిరించడానికే తండ్రి ఇలా చేస్తున్నాడు అనుకొని.. ఆరిఫ్ చిన్న కుమారుడు, సయ్యద్(18) నువ్వొక్కడివే చావడం ఎందుకు నేనూ చస్తానంటూ.. తండ్రి చేతిలోని సీసాను లాక్కొని అందులోని పురుగు మందు తాగాడు. ఆపై, అస్వస్థతకు గురైన తండ్రీకొడుకులను కుటుంబ సభ్యులు హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరిఫ్ మంగళవారం మరణించగా.. ఇంటర్ విద్యార్థి అయిన సయ్యద్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఇతను అదే ఆస్పత్రిలో ఉన్నాడు. ఆరిఫ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


కంపుకొడుతున్నాయి..



అల్లీనగర్ బందంకుంటలో భారీగా చేరిన పరిశ్రమల విష రసాయనాలు

- చెరువులు.. కుంటల్లోకి రసాయన జలాలు
- యథేచ్ఛగా విడుదల చేస్తున్న కొన్ని పరిశ్రమలు

జిన్నారం, అక్టోబరు, 28 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండల పారిశ్రామిక వాడల్లో నియంత్రణ లేని పరిశ్రమలతో జల వనరులు కలుషితం అవుతున్నాయి. ఏరులై పారుతున్న పరిశ్రమల రసాయనాల ప్రవాహంతో సమీపంలోని చెరువులు, కుంటలు కాలుష్య జలాలతో నిండిపోతున్నాయి. దశాబ్ధాలుగా ఈ సమస్య పట్టి పీడిస్తున్నా పరిష్కారం చూపే నాథుడే కనిపించడం లేదు. జిన్నారం మండలం గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారం ప్రాంత పరిధిలోని పలు రసాయన పరిశ్రమలు గుట్టుచప్పుడు కాకుండా రసాయన కాలుష్యాన్ని వదిలేస్తున్నాయి. వాస్తవానికి పరిశ్రమల నుంచి వెలువడి వ్యర్థ, రసాయన కాలుష్యజలాలను దూరంగా తరలించాల్సి ఉంటుంది. కానీ, కొందరు డబ్బులు మిగుల్చుకునేందుకు వాటిని బయటికి వదిలేస్తుండంతో చెరువులు, కుంటల్లోని జలాలు కలుషితమవుతున్నాయి. అలాగే, రసాయన జలాలు భూమిలో ఇంకి భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. మండలంలో అల్లీనగర్ శివారులోని బందం కుంట, కాజీపల్లి జిల్లెలవాగు, గండిచెరువు, గడ్డపోతారం అయ్యమ్మ చెరువులో భారీ స్థాయిలో రసాయన వ్యర్థాలు చేరి కంపుకొడుతున్నాయి. ఇటీవలే పీసీబీ అధికారులు వాయు కాలుష్యాన్ని నియంత్రించాలని పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించి, హెచ్చరికలు జారీ చేసినా వాటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీసీబీ అధికారులు స్పందించి రసాయిన, కాలుష్య జలాలను విడుదల చేస్తున్న పరిశ్రమలు, కర్మాగారాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాజీపల్లి జిల్లెలవాగులో ప్రవహిస్తున్న వ్యర్థ రసాయనాలు



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

గౌరవెల్లి ఉపకాలువ సర్వేను అడ్డుకున్న రైతులు

- రోడ్డుపై బైఠాయించి ఆందోళన

హుస్నాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులో చేపట్టిన గౌరవెల్లి రిజర్వాయర్ ఉపకాలువ సర్వేను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. ఉప కాలువ నిర్మాణానికి తమ భూములు ఇవ్వమని హుస్నాబాద్ శివారు ప్రాంతాలకు చెందిన రైతులు పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గతంలో డీ-4 కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోయామని, మళ్లీ ఇప్పుడు ఉప కాలువ నిర్మాణంతో ఉన్న భూములను కూడా కోల్పోతే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ కాలువ నిర్మాణాన్ని వేరే చోట డిజైన్ చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇందులో భూములు కోల్పోతున్న వారందరు చిన్న సన్నకారు రైతులని, ప్రాణం పోయినా భూములు ఇచ్చే ప్రసక్తి లేదని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, మేకల వికాస్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

భాషోపాధ్యాయులు షరీఫ్‌కు పురస్కారం



మహ్మద్ షరీఫ్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డికి చెందిన ప్రముఖ కవి, భాషోపాధ్యాయులు, తెలంగాణ తెలుగు పాఠ్యపుస్తక రచయిత మహ్మద్ షరీఫ్‌కు 'నీరాజనం' ఖండకావ్యానికి పెందోట పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సంవత్సరం సిద్దిపేటకు చెందిన శ్రీవాణి సాహిత్య పరిషత్ వారి పద్య విభాగంలో మహ్మద్ షరీఫ్ రచించిన ఖండకావ్యానికి పురస్కారం లభించడం అభినందనీయమని సాహిత్య రంజని సాహితీ కళా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెంటారెడ్డి, బాబురావు, శ్రీపాదబాలాజీ, సాయిలుచారీ, పూర్ణకృష్ణ, రవి, బస్వప్ప, కొండాపూర్ లక్ష్మీలు అభినందనలు తెలియజేశారు. వచ్చే నెలలో పురస్కారాన్ని అందుకోనున్నట్టు షరీఫ్ తెలిపారు

సస్తా మాల్



వెల్దుర్తిలో విక్రయిస్తున్న కూరగాయలు

- పిన్నీసు నుంచి పెళ్లి సామగ్రి వరకు
- అగ్గువకే అన్ని వస్తువులు
- వారంతపు సంతలకు తగ్గని క్రేజ్
- సూపర్ మార్కెట్లను తలపిస్తున్న అంగళ్లు

వెల్దుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పిన్నీసు నుంచి పెళ్లి సామగ్రి వరకు.. అన్ని వస్తువులు అగ్గువకే.. పట్టణాలకు వెళ్లాల్సిన పనిలేదు.. దుకాణాల చుట్టూ తిరిగి వెతకాల్సిన అవసరం లేదు.. కావాల్సినవన్నీ ఊళ్లోకే తెచ్చే వేదికలు.. పల్లె ప్రజల సూపర్‌మార్కెట్లు.. వారంతపు సంతలు. అందుకే కంప్యూటర్ యుగంలోనూ అంగడికి క్రేజ్ తగ్గడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వారానికోసారి నిర్వహించే అంగడికి క్రేజ్ తగ్గడం లేదు. రైతులు తమ పొలాల్లో పండించే కూరగాయలను, వ్యాపారులు తాము విక్రయించే వస్తువులను హోల్‌సేల్‌లో తెచ్చుకొని సరసమైన ధరలకు గ్రామాల్లో నిర్వహించే అంగళ్లలో విక్రయించడంతో అంగళ్లకు పేదోడి మార్కెట్‌గా నిలుస్తున్నాయి. నగరాల్లోని సూపర్ మార్కెట్లలో నిర్వహణ ఖర్చులు, ట్యాక్స్‌లు, సర్వీస్ చార్జీల పేరిట జేబులు గుల్లవుతాయి. కానీ, అంగళ్లలో వారం రోజులకు అవసరమయ్యే నిత్యావసరాలతో పాటు అన్నిరకాల వస్తువులు తక్కువ ధరకే దొరుకుతాయి.



అంగడిలో విక్రయిస్తున్న ప్లాస్టిక్ సామాను, దుస్తులు

తాజా సరుకులు

పట్టణాల్లోని సూపర్ మార్కెట్లలో నిల్వ చేసిన కూరగాయలు, వస్తువులు, తినుబండారాలు విక్రయిస్తే.. పల్లెల్లో నిర్వహించే అంగళ్లలో రైతులు పొలాల్లో పండించిన తాజా కూరగాయలు, పళ్లు, అప్పటికప్పుడే తయారుచేసే తినుబండారాలు తాజా అందజేస్తారు. వీటితో పాటు పట్టణాల్లోని దుకాణాల్లో విక్రయించే దుస్తులు, ఇళ్లలో వినియోగించే వంట సామాగ్రి, పాత్రలు, మహిళలకు, చిన్నారులకు అలంకరణ వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు అందుబాటులో ఉంటాయి. తాంబూలం వేసుకునే తమలపాకులతో మొదలు కొని వివాహాలు, విందుల్లోకి అవసరమయ్యే మసాలాలు, సామాన్యుల ఇంట్లో పెళ్లిలు, శుభకార్యాలకు అవసరమయ్యే అన్ని వస్తువులు సరసమైన ధరలకు దొరకడంతో నేటికి అంగళ్లను ఈతరం ప్రజలు మర్చిపోవడం లేదు.

అంగడే జీవనాధారం



ఇంటర్ చదివినా స్వయం ఉపాధి కోసం 18 సంవత్సరాలుగా వారాంతపు సంతల్లో సీజనల్ వ్యాపారం చేస్తున్నాను.ఆధునిక యుగంలోనూ గ్రామీణ ప్రాంతాల్లో అంగళ్లకు ఆదరణ తగ్గలేదు. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి నచ్చిన సరుకులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికీ మాలాంటి వ్యాపారులకు చేతినిండా పని దొరుకుతుంది.

- హరీశ్ వ్యాపారి, తూప్రాన్

అన్ని వస్తువులు దొరుకుతాయి



వెల్దుర్తిలో జరిగే శనివారం అంగడిలో ప్రతీ వస్తువు దొరుకుతుంది. ఏ వస్తువైనా దుకాణాల కంటే అంగడిలోనే తక్కువ ధరకు దొరుకుతున్నాయి. సంత లేనప్పుడు అవే వస్తువులు దుకాణాల్లో అడిగితే రెండితల ధరలు చెబుతారు. అంగడితో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా మేలు జరుగుతుంది.

- ఆగమయ్య, వెల్దుర్తి



అంగడిలో విక్రయిస్తున్న దుస్తులు

వెల్దుర్తి మండలంలో..

మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం నిర్వహించే అంగడికి మండలంతో పాటు చుట్టుపక్కల మండలాలైన శివ్వంపేట, చేగుంట, చిన్నశంకరంపేట, తూప్రాన్, కౌడిపల్లి, కొల్చారం మండలాలకు చెందిన ప్రజలు తరలివస్తారు. అంగడి రోజు కూరగాయాలు, వస్తువులు తెచ్చుకోకపోతే అవే వస్తువులను దుకాణాల్లో రెట్టింపు ధరలకు కొనాల్సివస్తుంది. అందుకే మండలంలో ప్రజలు వారం రోజులకే అవసరమయ్యే సరుకుల కోసం శనివారం అంగడికి తరలివస్తారు. ఆ రోజు వేలాది మందితో వెల్దుర్తి పట్టణం కిక్కిరిసిపోతుంది.

వైభవంగా అష్టలక్ష్మి మహా సుదర్శనయాగం

నారాయణఖేడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని జంట గ్రామమైన మంగల్‌పేటలో అష్టలక్ష్మి మహా సుదర్శన యాగంతో పాటు సామూహిక రమాసహిత సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. దుర్గామాత ఆలయ ప్రాంగణం, మా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం లలితా వైభవం ట్రస్టు తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకులు మలమంచి మోహన జ్యోషి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం అష్టలక్ష్మి ఉత్సవ విగ్రహాలను ఊరేగించడమే కాకుండా ప్రత్యేక పూజలు, అలంకరణ, హారతి కార్యక్రమాల అనంతరం అష్టలక్ష్మి మహా సుదర్శన యాగాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దాదాపు 300 మంది దంపతులు సామూహికంగా శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పురోహితులు మనోజ్‌జ్యోషి, గుడి చంద్రశేఖర్, చంద్రశేఖర్ పంతులు, చిన్ని మధుకర్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్ సతీమణి ఉమా షెట్కార్, ఎమ్మెల్యే సతీమణి అనుపమ్మరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పురోహితులు

మంజీర ఫ్యూచర్ సిటీ సాధనకు ఉద్యమం



మంజీర నది వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పుల్‌కల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంజీర నది కారిడార్-5వ ఫ్యూచర్ సిటీ సాధన ఉద్యమానికి బీజేపీ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ నాయకులు సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం వెండికోలు, లింగంపల్లి గ్రామ శివారు ప్రాంతాల్లోని మంజీర నది వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ ప్రవహిస్తున్న మంజీర నది ఈ ప్రాంత ప్రజలకు జీవనాధారమని బీజేపీ సీనియర్ నాయకుడు పల్వట్ల జగదీశ్వర్ పాటిల్ తెలిపారు. మహోన్నతమైన మంజీర నది తీర ప్రాంత అభివృద్ధి, పర్యావరణ సంరక్షణ, పర్యాటక రంగంగా ప్రోత్సహించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. 'మంజీర రివర్ కారిడార్-5వ ఫ్యూచర్ సిటీ' పేరుతో స్ఫూర్తిదాయక ప్రజాఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతిపత్రం అందజేయనున్నామని జగదీశ్వర్ తెలిపారు. ప్రజలను భాగస్వాములను చేసి ఈ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. మంజీర మనకు గర్వకారణమని, దాని పరిరక్షణ, అభివృద్ధి మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నీరుడి ప్రవీణ్‌ముదిరాజ్, ప్రవీన్‌రెడ్డి, నాయకులు గంగా జోగినాథ్, మఠం చంద్రశేఖర్, చంటి ప్రభు, దేవిక, రమేశ్‌బస్వరాజ్, మహేశ్, గాండ్ల శ్రీనివాస్, సార రాజ్‌కుమార్, చందాపురం ముకుందంముదిరాజ్, చాకలి రాజు తదితరులు పాల్గొన్నారు.

దీపారాధనతో శుభ పరిణామాలు

- మాధవానంద సరస్వతీ స్వామి



మాధవానంద సరస్వతీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నారాయణఖేడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో శివకేశవులను స్మరించుకుంటూ దీపారాధన చేయడం వల్ల శుభ పరిణామాలు జరుగుతాయని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. కార్తీక మాసంలో మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని నవంబరు 10న ఖేడ్ భక్త మార్కండేయ ఆలయంలో నిర్వహించనున్న కార్తీక దీపోత్సవం, తులసీదామోదర, శివ పార్వతుల కల్యాణ మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం స్థానిక మహతి జ్యోతిష్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతి పాత్రమైందన్నారు. జ్యోతిష్యాలయ నిర్వాహకులు, అర్చకులు బ్రహ్మశ్రీ గురురాజ శర్మ, భక్తులు స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు.



నాచగిరిలో దీపారాధన చేస్తున్న భక్తులు

నాచగిరి క్షేత్రంలో కార్తీక దీపారాధన

వర్గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో మంగళవారం భక్తులు కార్తీక దీపారాధన చేశారు. నిత్యం వివిధ రకాల ఆకృతులతో దీపారాధన చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామరావు పర్యవేక్షణలో దీపారాధన నిర్వహిస్తున్నారు. క్షేత్రానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకున్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నామని రామచంద్రాపురం భెల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధ చెప్పారు. ధర్మపురి, కొండగట్టు, కోటి లింగాలు, కొమరవెల్లి, మంత్రాలయం, మన్నెం కొండ, కురుమూర్తి, బీచ్పల్లిహనుమాన్ ఆలయం, కాళేశ్వరం, రామప్పఆలయం, భద్రకాళి ఆలయం, వేయి స్థంభాల గుడి, యాదగిరి గుట్ట, స్వర్ణగిరి, పంచరామాలు, అన్నవరం ఆలయాల సందర్శనకు బస్సు సౌకర్యం ఉంటుందని వివరించారు. తిరుపతి, చెన్నై, విశాఖపట్నం, అమలాపురం, కాకినాడ, శ్రీశైలం, గుంటూరు, చీరాల, గుడివాడ, తెనాలి, మచిలీపట్నం, విజయవాడ ప్రాంతాలకు వెళ్లడానికి సూపర్‌లగ్జరీ, రాజధాని, లహరి బస్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్, కంచి, అరుణాచలంకు ప్రయాణం చేయాలనుకునే వారు 93910 72283, 90634 01072 నంబర్లకు ఫోన్ చేసి టికెట్‌లు బుక్ చేసుకోవచ్చని ఆమె చెప్పారు.

మొక్కలు నాటారు.. నిర్వహణ మరిచారు

- మల్కాపూర్‌లో నర్సరీలో వర్షపు నీరే దిక్కు..
- అధ్వానంగా పల్లెప్రకృతి వనం



మల్కాపూర్‌లోని పల్లె ప్రకృతి వనంలో పేరుకుపోయిన చెత్త

తూప్రాన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఘనంగా ఏర్పాటు చేసిన పథకాలను అధికారులు పట్టించుకోవడంలేదు. నాటిన మొక్కలు గాలికి వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. నర్సరీలలో మొక్కలకు నీరు పెట్టడం మరిచిపోవడంతో వర్షపు నీరే దిక్కయింది. పల్లె ప్రకృతి వనంలో నాటిన చెట్లకు నీరందించకపోగా, నిర్వహణ కూడా మరిచిపోయారు. నర్సరీలో మొక్కలు నీరులేక వాడిపోతున్నాయి. ఈ ఘటన రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా పేరు తెచ్చుకున్న మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మల్కాపూర్ గ్రామం రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో గుర్తింపు పొంది వివిధ రాష్ట్రాల నుంచి ప్రజా ప్రతినిధులు.. అధికారులు సందర్శించారు. మల్కాపూర్ గ్రామానికి అందమైన పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి నిర్వహణకు గ్రామ పంచాయతీలకు అప్పగించారు. కానీ గ్రామ పంచాయతీగానీ, గ్రామ యువతగానీ పల్లె ప్రకృతి వనం వైపు కన్నెత్తి చూడటకపోవడంతో పల్లె ప్రకృతి వనం కేంద్రాలు కళావిహీనంగా తయారయ్యాయి. చెట్ల ఆకులు రాలిపోయి చెత్త చెదారం నిండిపోయింది. అలాగే వన మహోత్సవం నిర్వహించేందుకు గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణ సైతం గాలికి వదిలేశారు. మొక్కలకు నీరు పెట్టడమే మరిచిపోయారు. ఇటీవల కురిసిన వర్షాలే నర్సరీకి దిక్కయ్యాయి. అధికారులు స్పందించి పల్లె ప్రకృతివనం, నర్సరీల నిర్వహణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నర్సరీ దుస్థితి

మాజీ మంత్రి హరీశ్‌రావుకు పరామర్శ



సత్యనారాయణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న నేతలు

గజ్వేల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించారు. కోకాపేటలోని హరీశ్‌రావు నివాసంలో ఆయన తండ్రి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట నాయకులు మాదాసు శ్రీనివాస్, పంగ మల్లేశం, కరుణాకర్‌రెడ్డి, దేవీరవీందర్, మద్దూరి శ్రీనివాసరెడ్డి, దయాకర్ రెడ్డి, అనూప్, పాల రమేశ్, నవాజ్‌మీరా, విరాసత్ అలీ, యూసుఫ్ తదితరులు వారితో ఉన్నారు.

● ములుగు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ మాజీ మంత్రి హరీశ్‌రావుని పరామర్శించారు. ముందుగా సత్యనారాయణ రావు పార్థిక దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట ఉమ్మడి మెదక్ డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న అందె విద్యార్థులు, గ్రామస్థులు

మిరుదొడ్డి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలం పరిధి అందె గ్రామంలోని పాఠశాల ఆవరణలో మందుబాబులు మద్యం తాగుతున్నారని, వారిపై చర్యలను తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈమేరకు మంగళవారం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులతో కలిసి వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడతూ అలాగే గుంతలమయంగా మారిన రోడ్డును బాగు చేయించేందుకు కృషి చేయాలన్నారు. మిరుదొడ్డి నుంచి అందె గ్రామం వరకు గుంతలు పడి ప్రయాణం నరకయాతనగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా గ్రామంలోని వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అందె గ్రామ జేఏసీ నాయకులు తదితరులున్నారు.

గీతకార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

● కేజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి



సమావేశంలో మాట్లాడుతున్న కేజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి

చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి అన్నారు. చేర్యాల పట్టణంలోని వైశ్య భవనంలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తిలో భాగంగా గాయాలపాలైన గీత కార్మికులను ఆదుకోవడంలో తాత్సారం వహిస్తుండడంతో దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. కాటమయ్య రక్షణ కవచాలు, పెన్షన్, ఎక్స్‌గ్రేషియా అమలు చేయకపోవడం తగదన్నారు. ప్రతీ సొసైటీకి 5 ఎకరాల స్థలం కేటాయించి హైబ్రిడ్ తాటివనాలు పెంచాలని కోరారు. సమావేశంలో నాయకులు కొహెడ కొమురయ్య, బండకింది అరుణ్, అనగోని నర్సింహులు, ఆకుల కనకయ్య, పోతుగంటి లింగం, సత్తయ్య, తాళ్లపల్లిరాజు, గనబోయిన నర్సింహులు, హన్మన్లకాడి నవీన్, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ గణపతిరావు

గజ్వేల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, షీటీం ఆధ్వర్యంలో అయా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత తన కెరీర్‌పై దృష్టి సారించి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. షీటీం సభ్యులు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, స్నేహిత, భరోసా సెంటర్లు, డయల్ 100 ప్రాముఖ్యతను గురించి వివరించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అలివేలు, రాంచంద్రం, పెద్ది రాజు, భవాని, సిబ్బంది తదితరులున్నారు.

'కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి'

జగదేవ్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే దాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాందాపూర్, వట్టిపల్లి, ఇటిక్యాల, పీర్లపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ధాన్యాన్ని అరబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏవో వసంతరావు, తహసీల్దార్ నిర్మల, పీఏసీఎస్ డైరెక్టర్ జశ్వంత్‌రెడ్డి, కొండపోచమ్మ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పేరు బొల్ల శ్రీనివాస్ రెడ్డి తండ్రి ప్రతాప రెడ్డి వయస్సు 42 వీరి పేరు మీద గల ఒరిజినల్ పాసుపోర్టు నంబరు F9092293 ఈ పాసుపోర్టు తేది: 03.10.2025 రోజున గోపులాపూర్ నుండి సిద్దిపేటకు సొంత వాహనంపై వస్తుండగా పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నంబరుకు తెలుపగలరు.

ఫోన్: 9849781984



హుస్నాబాద్- నాగారం మార్గంలో రోడ్డును మూసేస్తున్న పొదలు

రోడ్డును కప్పేస్తున్న పొదలు

● ప్రమాదాల బారిన వాహనదారులు

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నుంచి నాగారం, మడద గుండా హుస్నాబాద్ వెళ్లే ప్రధాన రహదారిని పిచ్చి చెట్ల పొదలు కప్పేస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా పెద్ద వాహనాలు వస్తే ముందుకు వెళ్లే పరిస్థితి లేక వాహనదారులు అవస్థలు పడతుఉన్నారు. అయినా అటు మున్సిపల్ అధికారులు గాని, ఇటు పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. వర్షాల కారణంగా చెట్ల పొదలు గుబురుగా అల్లుకుని రోడ్డు పైకి రావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్ల పొదలు, రోడ్డును అల్లుకుపోతున్న పిచ్చి చెట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



నాగారం మార్గంలో రోడ్డు మధ్యంలోకి వచ్చి చెట్ల కొమ్మలు

'మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు'

వర్గల్, ములుగు, కుకునూరుపల్లి, తొగుట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, ములుగు ఎస్సై విజయ్ కుమార్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, తొగుట సీఐ లతీఫ్ హెచ్చరించారు. మంగళవారం అయా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానాలు, జైలు శిక్షలు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు వంటి చర్యలు ఉంటాయని తెలిపారు. మొదటిసారి పట్టుబడితే రూ.10 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష, ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయనున్నట్లు తెలిపారు. రెండవసారి పట్టుబడితే రూ.15 వేల జరిమానా విధించబడుతుందని, జరిమానా కట్టని వారికి జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చేయవద్దని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ములుగు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. సైలెన్సర్ మార్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బీటీ రోడ్లపై వడ్లు ఆరబెట్టడం చేయరాదు. అలా చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, అలా జరిగిన రైతులపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ సుగ్రీవ్, వ్యవసాయ శాఖ అధికారులు

దౌల్తాబాద్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పత్తి రైతుల కోసం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ సుగ్రీవ్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో అయా గ్రామాలకు చెందిన రైతులకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి పంటను అమ్ముకోవడంపై ఆయన వ్యవసాయ శాఖ అధికారి సాయి కిరణ్ తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో రైతులు సాగు చేసిన పంటలు, మొక్కజొన్న, వరి కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.



గణిత శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి

గణితంతో మేధోసంపత్తి బలోపేతం

● జిల్లా విద్యాధికారి శ్రీనివాస్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గణితం పట్ల విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి ఆసక్తిని పెంచాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ అంశంపై జిల్లాలోని గణిత ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. మారుతున్న కాలంలో గణిత పరిజ్ఞానం అవసరం పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లోని తెలివితేటలను గణితం పదును పెడుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులను వికసింపజేయాలని సూచించారు. కోర్సు డైరెక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన సంపదకు గణితం పునాది వంటిదని చెప్పారు. సులభంగా గణితం నేర్చుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. శిక్షణలో జిల్లాలోని వివిధ ప్రాంతాల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ ఆసుపత్రికి అధునాతన యంత్రాలు

● రూ. 1.50 కోట్లతో ఏర్పాటు.. ● త్వరలో అందుబాటులోకి



ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న యంత్రాలు

హుస్నాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి అధునాతనమైన యంత్రాలు మంజూరయ్యాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫౌండ్ ద్వారా రూ.1.50 కోట్లతో వైద్య పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఈసీజీ మిషన్, అల్ట్రా సౌండ్, మల్టీ పారామీటర్, ఆటో క్లేవ్, డయాథెర్మి, డబుల్ డోమ్ ఓటీ లైట్, అనస్తీషియా వర్క్ స్టేషన్, ఫెటల్ మానిటర్, మార్చురీకెబినెట్ జనరల్ సర్జరీ ఓటీ టెబుల్, ఎమర్జెన్సీ రికవరీ ట్రాలీ, త్రీ సీటర్ చైర్లు, ఈఎన్‌టీ హెడ్‌లైట్, సేయిరింగ్ పంపు యూనిట్ ఉండగా వీటిని ఆసుపత్రిలోని అయా గదుల్లో ఫిటింగ్ చేస్తున్నారు. ఇవి త్వరలో రోగులకు అందుబాటులోకి రానున్నాయి. హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వీటిని మంజూరు చేయించారని బీజేపీ నాయకులు తెలిపారు. బండి సంజయ్‌కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల్లో 'మొంథా' గుబులు

(5వ పేజీ తరువాయి)

వాతావరణంలో వర్ష ప్రభావం దృష్ట్యా, రైతులు పత్తి తీసే పనులు, వరి కోతలు నిలిపివేయడం శ్రేయస్కరమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు:

రానున్న రెండు రోజుల్లో మొంథా తుఫాను కారణంగా జిల్లాలో తీవ్ర వర్షాలు పడతాయన్న వాతావరణ కేంద్ర హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం వ్యవసాయ శాఖ ఈ కింది సూచనలు జారీ చేసింది: రైతులు వర్షాల కారణంగా 2-3 రోజులు పంట కోతను తప్పక వాయిదా వేసుకోవాలి. ఇప్పటికే కోతపట్టిన ధాన్యాన్ని పూర్తిగా టార్పాలిన్లతో కప్పి రక్షించుకోవాలి. పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రబీ పంటలలో కలుపు మందులు మరియు సస్యరక్షణ మందులను పిచికారీ చేయడం వాయిదా వేసుకోవాలి. పొలాల్లో నీరు నిలిచినట్లయితే, నీరు బయటికి వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేసుకోవాలి.



ఆట కట్టించారు

(5వ పేజీ తరువాయి)

పలు బృందాలుగా విడిపోయిన పోలీసులు సోమవారం రాత్రి మెరుపుదాడి చేశారు. మూడు గంటలకు పైగా జరిగిన ఈ తనిఖీల్లో పలు టేబుళ్ల చుట్టూ 50 మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పోలీసుల విచారణలో ఇద్దరు వ్యక్తులు ఫోన్ పే/గూగుల్ పే ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశారు. మరో ఐదుగురు 20 ప్లాస్టిక్ కాయిన్స్ ఆడారు. మిగిలిన 43 మంది వ్యక్తులు పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు డబ్బులకు బదులు స్కోర్ కార్డులో వివరాలు నమోదు చేసుకుని, బయటకు వెళ్లిన తరువాత డబ్బులు ఇచ్చి పుచ్చుకుంటున్నట్లు తేలింది. క్లబ్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడితో పాటు సభ్యులను అదుపులోకి తీసుకొని, రెండు సెల్ ఫోన్‌లు, 8ప్లే కార్డు సెట్స్, 6 స్కోర్ కార్డులు, 20 ప్లాస్టిక్ కాయిన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

పట్టుబడినవారిలో రాజకీయ నాయకులు

ఈ మెరుపు దాడిలో పట్టుబడిన 50 మందికి పైగా వ్యక్తులలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు ఉండటంపై తీవ్ర చర్చనీయాంశమైంది.

ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

క్లబ్‌లో జరుగుతున్న పేకాట తతంగంపై గతేడాది మార్చిలోనే ఆంధ్రజ్యోతి "క్లబ్బులో గబ్బు" అంటూ కథనాన్ని ప్రచురించింది. గోవా క్యాసినో తరహాలో కాయిన్‌లు పెట్టి ఆడుతున్నారని హెచ్చరించినా అప్పట్లో పోలీసులు స్పందించలేదు.

పోలీసులను అభినందిస్తున్న బాధితులు

పోలీసులకు గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పలు విమర్శలు వచ్చాయి. నూతన సీపీ విజయ్‌కుమార్ ఆదేశాలతో ఎట్టకేలకు కేసులు నమోదు చేయడం పట్ల పేకాట వల్ల నష్టపోయిన బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేకాట ఆడకుండా కఠినంగా వ్యవహరించాలని, నిత్యం తనిఖీలు చేపట్టాలని కోరుకుంటున్నారు.


ABN ఆంధ్రజ్యోతి
క్లబ్బులో.. గబ్బు

సిద్దిపేట పట్టణంలో క్లబ్బులో గబ్బు అంటూ ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనం

పత్తి రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలి

ములుగు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని ములుగు వ్యవసాయ అధికారి ప్రగతి కోరారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో దాదాపు 790 మంది రైతులు 883 ఎకరాలలో పత్తి సాగు చేశారని తెలిపారు. పత్తిని సీసీఐలో మద్దతు ధరకు అమ్మాలంటే, ముందుగా కపాస్ కిసాన్ అనే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, తమ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయ్యి స్లాట్ బుక్ చేసుకుని, అందుకనుగుణంగా మిల్లుకు పత్తిని తీసుకొని వెళ్లాలని సూచించారు. రైతులు తమ ఫోన్ నంబర్‌ను సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గరికి వెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలని కోరారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులు ఇతరుల ఫోన్‌లో తమ యొక్క మొబైల్ నంబర్‌తో లాగిన్ అయ్యి స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

'ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'

మద్దూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాను ఉన్నందున ధాన్యం దడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాంమోహన్ సూచించారు. మంగళవారం మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించి మాట్లాడారు. ధాన్యంలో నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏఈవో కల్పన, నిర్వాహకులు ఉన్నారు.

నలుగురికి జైలుశిక్ష

గజ్వేల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, రూ.800 జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలు చౌరస్తాల్లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో నలుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడగా, మంగళవారం వారిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపిన గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించినట్లు చెప్పారు.

స్మార్ట్ టీవీ విరాళం

చేర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రిటైర్డ్ ఇంజనీర్ కాటం సంజీవయ్య మంగళవారం స్థానిక మనోచేతన మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించి రూ.32 వేలు విలువగల స్మార్ట్ టీవీని విరాళంగా అందజేశారు. మానసిక దివ్యాంగుల సంక్షేమం కోసం మనోచేతన అందిస్తున్న సేవలు ప్రశంసించదగినవని కొనియాడారు. కార్యక్రమంలో మనోచేతన నిర్వాహకులు కాశెట్టి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కుకునూరుపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిప్పారం గ్రామానికి చెందిన తిమ్మాపురం మల్లేశం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం పరిస్థితి గమనించి మండల బీఆర్ఎస్ నాయకుడు కరుణాకర్ ఆ కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కోరే చరణ్ అప్ప, నాగప్ప, స్వామి, ముద్దపురం మహేందర్, మహేష్, శేఖర్, ఎల్లం, బాలరాజ్, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులున్నారు.

సీసీఐ కేంద్రం ప్రారంభం



సిసిఐ కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తి పంటను సీసీఐ కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏఎంసీ కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గల పత్తి మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించారు. తేమ శాతం మించకుండా పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకురావాలని కోరారు. అలాగే ముందుగా రైతులు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ మహేష్, ఏఎంసీ డైరెక్టర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'యాప్' సోపాలు

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని, రైతు వేదికల ద్వారా సహాయం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నిబంధనలు సడలించాలి

గతంలో నచ్చిన జిన్నింగ్ మిల్లుకు తీసుకువెళ్లేవాళ్లం. ఇప్పుడు యాప్ ద్వారా నమోదు చేసుకున్న మిల్లుకే తీసుకువెళ్లాలి. మిల్లు వద్ద రద్దీ ఉన్నా పడిగాపులు తప్పడం లేదు. రవాణా ఖర్చులు భరించే పరిస్థితి లేక, ఇంట్లో నిల్వ ఉంచుకుందామంటే స్థలం లేదు. అకాల వర్షాలకు పత్తి తడవడం వల్ల స్లాట్ నమోదు చేసుకున్న రోజు మిల్లుకు తీసుకెళ్లలేకపోతున్నాం. నిబంధనలు సడలించి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనగోళ్లు చేపట్టాలి.

- బీర్ల మహేశ్, చేర్యాల

పాత ఫోనే ఉంది నా దగ్గర

ముందేమో వర్షాలు లేక తరువాత అధికంగా వర్షాలు పడటంతో పంట సరిగా రాలేదు. కొద్దిపాటిగా పండిన పత్తిని ఇప్పుడు అమ్ముకుందామంటే మళ్లీ వర్షాలు పడుతుండటంతో పత్తి ఏరడానికి అవ్వడం లేదు. పత్తి అమ్ముకోవాలంటే ఇప్పుడేదో కొత్త యాప్‌లో నమోదు చేయాలట. దానికి పెద్ద ఫోన్ కావాలట. కానీ నాకు పాత ఫోన్ ఉపయోగించడం మాత్రమే తెలుసు. ఎవరిని అడగాలో, ఎట్లా అమ్మాలో అర్థం కావడం లేదు

- డి. చంద్రయ్య, చేర్యాల